# ప్రపంచం మొత్తం గొప్పగా జరుపుకునే పండుగ క్రిస్మస్


మారేడ్‌పల్లిలోని నివాసంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో భాగంగా కేక్‌కట్ చేస్తున్న తలసాని శ్రీనివాస్‌యాదవ్

**ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్**

బేగంపేట్, డిసెంబర్ 24: ప్రపంచం మొత్తం గొప్పగా జరుపుకునే ఏకైక పండుగ క్రిస్మస్ అని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఆదివారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసంలో క్రైస్తవ ప్రముఖుల సమక్షంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం చర్చి పాస్టర్స్ ఆయనకు ఆశీర్వచనం చేశారు. క్రిస్మస్ వేడుకల్లో భాగంగా మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ చర్చి పాస్టర్స్ కార్పొరేటర్‌లతో కలిసి కేక్‌కట్ చేసి పాస్టర్‌లకు తినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని మాట్లాడుతూ.. ఏసుక్రీస్తు పుట్టిన రోజును క్రిస్మస్ పర్వదినంగా జరుపుకుంటారని అన్నారు. డిసెంబర్ నెల మొత్తం క్రిస్మస్ వేడుకలతో చర్చ్‌లు సర్వాంగా ముస్తాబు చేస్తారన్నారు. ప్రతి ఒక్కరు ఏసు చూపిన సన్మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్‌లు కొలన్ లక్ష్మి, మహేశ్వరి, హేమలతా, పాస్టర్‌లు శ్యాంసన్, విజయ్, క్రైస్తవ ప్రముఖులు ఫ్రాంక్లిన్, ప్రశాంత్, రాజ్‌గోపాల్‌దాస్, విలియమ్, జయరాజ్‌లోపాటు బీఆర్ఎస్ నాయకులు శ్రీహరి, ఆకుల హరికృష్ణ, లక్ష్మీపతి, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి రథ మండపం ప్రారంభం

అమీర్‌పేట్, డిసెంబర్ 24 : అమీర్‌పేట్ కనకదుర్గమ్మ దేవాలయం వెలుపల దాతల సహకారంతో నిర్మించిన రథ మండపాన్ని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆదివారం ప్రారంభించారు. రూ.14లక్షల వ్యయంతో ఈ రథ మండపాన్ని రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి డి.పార్థసారథి, సుశీల దంపతుల కుటుంబసభ్యులు నిర్మించారు. రథ మండపాన్ని నిర్మించిన దాతలు డి.పార్థసారథి కుటుంబ సభ్యులను ఈ సందర్భంగా తలసాని అభినందించారు. మండపాన్ని ప్రారంభించిన అనంతరం కనక దుర్గమ్మ అమ్మవారిని దర్శించుకున్న తలసానికి ఆలయ చైర్మన్ మల్లికార్జునప్ప ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారితోపాటు దాతల కుటుంబసభ్యులు డీఎస్ శ్రీనివాస్, రాగమయి, అప్పిలి శివకుమార్, డాక్టర్ పద్మజలతోపాటు బీఆర్ఎస్ నాయకులు వి.కరుణాకర్‌రెడ్డి, ఆర్.కృష్ణారెడ్డి, వి.విఠల్‌రెడ్డి, డి.అనంతరెడ్డి, బీకేఎం సత్యనారాయణ, రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.


కనక దుర్గమ్మ అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే తలసాని

## బంజారాహిల్స్‌లో ర్యాలీ ఆఫ్ హ్యాపీనెస్



బంజారాహిల్స్, డిసెంబర్ 24: బంజారాహిల్స్ లోని కేబీఆర్ పార్కువద్ద క్రీమ్‌స్టోన్ సంస్థ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకల్లో భాగంగా క్రిస్మస్ ర్యాలీ ఆఫ్ హ్యాపీనెస్ పేరుతో బైక్ ర్యాలీ నిర్వహించారు. శాంతాక్లాజ్ వేషధారణతో యువతీయువకులు ఉత్సాహంగా బైక్ ర్యాలీలో పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 3న గ్రాండ్ గాలా కార్నివాల్

**కర్టెన్ రైజర్‌లో సందడి చేసిన బిగ్‌బాస్ కంటెస్టెంట్స్**

బంజారాహిల్స్, డిసెంబర్ 24: నగరంలోని సంగీత అభిమానులను , ఫ్యాషన్, షాపింగ్ ప్రియులను ఉర్రూతలూగించేందుకు సౌతిండియాలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే గ్రాండ్ గాలా కార్నివాల్‌కు నగరం వేదిక కానుందని నిర్వాహకులు తెలిపారు. ఫిలింనగర్‌లో ఏర్పాటు చేసిన కర్టెన్ రైజర్‌లో కార్నివాల్‌కు సంబంధించిన వివరాలను బిగ్‌బాస్ కంటెస్టెంట్స్ శుభశ్రీ రాయగురు, యావర్. గీతూ రాయల్, ఆర్‌జే చైతన్య తదితరులతో కలిసి నిర్వాహకులు మనీందర్‌రెడ్డి వెల్లడించారు. ఫిబ్రవరి 3న మాదాపూర్‌లోని ఎన్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించనున్న గ్రాండ్ గాలా కార్నివాల్ దక్షిణాదిన అతిపెద్ద వేడుకగా నిలవబోతున్నదన్నారు. లైవ్ బ్యాండ్, ఫ్యాషన్, జ్యువెల్లరీ తదితర అంశాల్లో అనేక ఈవెంట్స్ నిర్వహించనున్నామని తెలిపారు.

## కన్నులపండువగా సెమీ క్రిస్మస్ వేడుకలు


బంజారాహిల్స్‌లోని షరోన్ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలు

బంజారాహిల్స్/ఖైరతాబాద్, డిసెంబర్ 24: బంజారాహిల్స్ రోడ్ నం.12 ఎమ్మెల్యే కాలనీలోని షరోన్ చర్చ్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు కన్నులపండువగా నిర్వహించారు. దీనిలో భాగంగా చర్చ్ పాస్టర్ రెవరెండ్ ఎం.ప్రభుదాస్ ప్రత్యేక సందేశాన్ని అందజేశారు. క్రీస్తు రాకను స్వాగతిస్తూ పాడిన భక్తిగీతాలతో ఆధ్యాత్మికత నెలకొన్నది. ఈ సందర్భంగా యువతీ యువకులు, చిన్నారులు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా క్రీస్తు జననంతోపాటు ఆయన మహిళను వివరిస్తూ నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం రెవరెండ్ ప్రభుదాస్‌తోపాటు ఇతర మతపెద్దలతో కలిసి క్రిస్మస్ కేక్‌కట్ చేశారు.

❖ ఖైరతాబాద్ మారుతీనగర్‌లోని దమస్కస్ మినిస్ట్రీస్ చర్చ్‌లో వేడుకలు ఘనంగా జరిగాయి. రెవరెండ్ డాక్టర్ పాల్ కరుణాకర్ క్రీస్తూ సందేశాన్ని వినిపించగా, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నేడు క్రైస్తవులందరూ వేడుకలను ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

## అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి


బహదూర్(ఫైల్)

బంజారాహిల్స్, డిసెంబర్ 24 : అనుమానాస్పద స్థితిలో నేపాల్‌కు చెందిన డ్రైవర్ మృతి చెందిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే..నేపాల్‌కు చెందిన చట్ బహదూర్ తాపా(47) అనే వ్యక్తి బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి వెంకటగిరిలోని ఓ భవనంలోని పెంట్‌హౌజ్‌లో గత ఆరునెలలుగా అద్దెకు ఉంటూ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కాగా, గత మూడురోజులుగా బహదూర్ తాపా గదిలో ఉండటంతోపాటు ఫోన్ ఎత్తడం లేదంటూ అతడి కుమార్తె ఆదివారం ఉదయం అదే ఇంట్లోని మూడో ఫ్లోర్‌లో ఉంటున్న బంధువు లక్ష్మణ్ తాపాకు ఫోన్ చేసింది. దీంతో లక్ష్మణ్ తాపా పెంట్‌హౌజ్ వద్దకు వెళ్లి కిటికీ లోంచి చూడగా మంచంమీద బహదూర్ తాపా మృతదేహం కన్పించడంతో పోలీసులకు సమాచారం అందజేశాడు. పోలీసులు కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అన్ని కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## దళితుల ఆర్థిక అభ్యున్నతికి 'డిక్కా' కృషి


'డిక్కా' సంస్థ ప్రారంభించిన ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు

బన్సీలాల్‌పేట్, డిసెంబర్ 24 : నిరుపేద మాదిగ, ఉపకులాల ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా ఎదిగేందుకు సహరించడానికి 'డిక్కా' సంస్థ కృషి చేయడం అభినందనీయమని ఉస్మానియా లా కళాశాల మాజీ డీన్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ అన్నారు. బన్సీలాల్ పేట్ బీజేఆర్‌నగర్‌లో సంస్థ ప్రధాన కార్యాలయాన్ని ఆయన మాజీ ఎమ్మెల్సీ డి.రాజేశ్వర్ రావుతో కలిసి ప్రారంభించారు. సంస్థ చైర్మన్ రాగటి సత్యం మాదిగ, వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు రాగటి భవానికుమార్ మాట్లాడుతూ.. అణగారిన కులాల పారిశ్రామిక, నిశ్చయ కార్యాచరణ వాణిజ్య మండలి(డిక్కా)పేరుతో రిజిస్టర్డ్ చేయబడిన తమ సంస్థ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీల అభ్యున్నతికి విజయవంతంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి జాతీయ, రాష్ట్ర, మండల, గ్రామస్థాయిల్లో ప్రజా చైతన్య కార్యక్రమాలు, అవగాహన శిబిరాలను ఏర్పాటు చేస్తామని అన్నారు. ఆర్థికాభివృద్ధికి అంకిత భావంతో పనిచేయడానికే తమ 'డిక్కా' సంస్థ పనిచేస్తుందని, పేద మాదిగలు నేరుగా బన్సీలాల్‌పేట్ బీజేఆర్ నగర్‌లోని తమ సంస్థ కార్యాలయానికి నేరుగా రావొచ్చని వారి కోరారు. పారిశ్రామికవేత్తలు పుట్టపాక శ్రీనివాస్, చింతా సాంబమూర్తి, డాక్టర్ ఎం.శివకుమార్ లాల్ పాల్గొన్నారు.

## నిమ్స్ విస్తరణతో సమస్యలు లేకుండా చూడాలి

**మంత్రి దామోదర రాజనర్సింహకు వినతి**

బంజారాహిల్స్, డిసెంబర్ 24: నిమ్స్ విస్తరణ పనుల పేరుతో ఎర్రమంజిల్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన పాత దారులను మూసేశారని, దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్య పరిష్కరించాలని ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి ఆదివారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి డా.దామోదర రాజనర్సింహ కోరారు. మంత్రిని కలిసిన కార్పొరేటర్ విజయారెడ్డి వినతిపత్రం అందజేశారు. ఎర్రమంజిల్ స్కూల్ వివిధ ప్రాంతాల నుంచి నడుచుకుంటూ వచ్చే పేద విద్యార్థులు నిమ్స్ పార్కింగ్ స్థలంలో నుంచి రావాల్సి వస్తోందని, అక్కడ ఆస్పత్రికి సంబంధించిన వ్యర్థాలు డంపింగ్ చేస్తుంటారని, దీనివల్ల విద్యార్థుల ఆరోగ్యానికి ముప్పు పొంచి ఉందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఈ విద్యా సంవత్సరం పూర్తయ్యేదాకా పాత దారులను తెరవాలని కోరారు. అధికారులతో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

## అయ్యప్ప పడిపూజలో ఎమ్మెల్యే దానం



బంజారాహిల్స్.డిసెంబర్ 24 : ఫిలింనగర్ దుర్గాభవానీనగర్ ఎల్లమ్మ మారమ్మ దేవాలయంలో జయరాం గురుస్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అయ్యప్పస్వామి మహాపడి పూజ కార్యక్రమంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పాల్గొనగా, జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లో అయ్యప్ప పడిపూజ కార్యక్రమంలో కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్ పాల్గొన్నారు.

## గ్యార్వీ షరీఫ్ వేడుకల్లో ..

ఖైరతాబాద్, డిసెంబర్ 24 : సోమాజిగూడ డివిజన్ ఎంఎస్‌మక్తాలో గ్యార్వీ షరీఫ్ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే దానం నాగేందర్ చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు వనం సంగీత యాదవ్, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ యాదవ్, మైనార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వయోధికుల భవన నిర్మాణం జరిగేలా చూస్తా

అమీర్‌పేట్, డిసెంబర్ 24 : జెక్‌కాలనీలో 500 మందికి పైగా ఉన్న వయోధికుల కోసం భవన నిర్మాణం జరిగేలా చూడాలని కోరుతూ కాలనీ వయోధికుల సంఘం తరపున ఉమామహేశ్వర్‌రావు సహా పలువురు ప్రతినిధులు ఆదివారం సనత్‌నగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ డాక్టర్ కోట నీలిమను కలిసి విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు. ఏడు పదులు దాటిన తరువాత తమ కాలక్షేపం కోసం ఓ భవన నిర్మాణం జరిగితే బాగుంటుందని, తాము సేకరించిన 2వేల పుస్తకాలను దాచుకునేందుకు కూడా తగిన స్థలంలేదని ఆయన కోట నీలిమ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు.

## గోమాతను రక్షించుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న రాజీవ్‌షా

హిమాయత్‌నగర్, డిసెంబర్24: గోమాతను రక్షించుకుని, హిందూ ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఏకం సనాతన్ భారత్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు రాజీవ్ షా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేందర్‌కుమార్ చతుర్వేది అన్నారు. ఆదివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. గోమాత వల్ల ఆర్థిక, ఆరోగ్య లాభాలు ఉన్నాయని, గోమాతను జాతీయ ప్రాణిగా గుర్తించేందుకు కేంద్ర ప్రభుత్వం తగిన చొరవ తీసుకోవాలని కోరారు. అయోధ్యలో రామ మందిరం నిర్మాణ పూజ కార్యక్రమం సనాతన హిందువుల పద్ధతి ప్రకారం జరగలేదని, ప్రఖ్యాతిగాంచిన పీఠాధిపతులు, సతీసమేతంగా ఎవరూ పాల్గొనలేదని విమర్శించారు. దేశంలోని హిందూ దేవాలయాలపైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధిపత్యం ఉండవద్దని, ఆలయాల్లో భక్తులకు ఉచిత ప్రవేశం కల్పించాలన్నారు. ఆలయాలు, వాటి ఆస్తుల నిర్వహణ హిందూ సమాజమే నడిపించాలన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో 60 పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు వినయ్‌కుమార్‌శర్మ, ఠాగూర్ భగత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.